క్లుప్తంగా

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

ఎంఈఓ సీహెచ్ రమాదేవి



సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రమాదేవి

ప్రత్తిపాడు: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి హెచ్ఎంలను ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు వరసగా సెలవులు ప్రకటిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. బుధవారం పాఠశాలలు తెరిచినప్పటికీ పాఠశాలలను సిద్ధం చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు సూచించడంతో స్థానిక ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంఈఓ రమాదేవి పరిశీలించారు. మధ్యాహ్న భోజన బియ్యం తడిలేని ప్రదేశంలో ఉంచాలన్నారు. పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం లేకుండా, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను సరఫరా చేసింది. వీటిని స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో రమాదేవి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే విద్యార్థులకు పుస్తకాలను అందించాలని ఎంఈఓ ఆదేశించారు.

మనస్తాపానికి గురై వృద్ధుడి ఆత్మహత్య!



ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు బొల్లయ్య

ప్రత్తిపాడు: మనస్తాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన పసుపులేటి బొల్లయ్య(80) గత కొంత కాలంగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. రెండేళ్ల కిందట భార్య మృతి చెందడంతో పాటు కుమారుడి కాపురం కూడా ఆశించిన విధంగా లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై మనోవేదన అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న మంచి నీటి బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బావిలో మృతదేహం పడి ఉండటం గమనించిన స్థానికులు ప్రత్తిపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కె.నాగేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. శరీరంపై ఎటువంటి గాయాలు గానీ, ఇతరత్రా వివాదాలుగానీ లేకపోవడంతో కుటుంబ సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

ఈ పంటలో నమోదు చేసుకోవాలి

పొన్నూరు: పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలో పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో 37,194 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు వేశారని, ఇప్పటి వరకు 31,487 ఏకరాలకు సంబంధించి రైతులు ఈ పంటలో తమ వివరాలు నమోదు చేసుకున్నారని ఏడీఏ రమా కోటేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట వేసిన ప్రతి రైతు ఈ పంటలో తమ వివరాలు నమోదు చేసుకొంటేనే ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందించే అన్ని పథకాలకు అర్హులవుతారని తెలిపారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో పంట వేసిన రైతులందరు మరో రెండు రోజులలో తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ పంటలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడం వలన గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లి మండలంలో 27.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.4 మి.మీ. వర్షం పడింది. సగటున 11.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. దుగ్గిరాల మండలంలో 27.4 మి.మీ., కొల్లిపర 18.8, తాడికొండ 17.2., మంగళగిరి 16, పెదకాకాని 14.8, తెనాలి 14.2, తుళ్లూరు 13.8, గుంటూరు తూర్పు 12.4, గుంటూరు పశ్చిమ 12, మేడికొండూరు 9, ఫిరంగిపురం 6.2, వట్టిచెరుకూరు 6.2, చేబ్రోలు 5.4, పెదనందిపాడు 1.2, కాకుమాను మండలంలో 0.6 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ మాసం 4వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 19.1 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 171.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పంట కాలువలకు గండ్లు

- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- నంబూరు శివార్లలో రోడ్లపైనే ప్రవహిస్తున్న వరదనీరు
- ఆందోళనలో అన్నదాతలు



నంబూరు శివార్లలో గండిపడిన దృశ్యం



పెదకాకాని వద్ద గండి పడిన గుంటూరు చానల్(కొత్తకాలువ)

పెదకాకాని: వరద నీరు ప్రభావంతో పంట కాలువలకు గండ్లు పడి వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పెదకాకాని సమీపంలో గుంటూరు చానల్‌కు గండి పడగా, నంబూరు వీవీఐటీ రోడ్డులో పాతకాలువకు గండి పడింది. అలానే నంబూరు నుంచి పెనుమూలి వెళ్లే రోడ్డులో ఉన్న మురుగుకాలువలకు గండి పడటంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తూ పంట పొలాలను ముంచెత్తాయి. ఐదు రోజులుగా పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అన్నదాతలు ఇప్పటికే వరి విత్తనాలు, వ్యవసాయం, ఎరువులు, పురుగుమందుల రూపంలో పంటలకు పెట్టుబడులు పెట్టారు. పొలాల్లోకి చేరిన నీరు ఎప్పుడు బయటకు వెళుతుందో, పైరు పనికొస్తుందో, చనిపోతుందో అనే సందేహంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నంబూరు, పెదకాకాని, గోళ్లమూడి, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, తంగెళ్లమూడి గ్రామ శివార్లలో వరిపొలాల్లోకి చేరిన నీరు చెరువులను తలపిస్తున్నాయి. నంబూరు నుంచి పెనుమూలి వెళ్ళే రోడ్డులో ఇప్పటికీ వరదనీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. పెదకాకానిలో మిరప సాగు కోసం నాటిని మిరపనారుమళ్ల కూడా దెబ్బతిన్నాయి. మండలంలోని ఏడు వేల ఎకరాల్లో వరి పైరు, 150 ఎకరాల్లో పత్తి, 80 ఎకరాలు మినుము దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని ఏఓ పి.సంధ్యారాణి తెలిపారు.



నంబూరు, గోళ్లమూడి సమీపంలో వరి పొలాలు



నంబూరు శివారులో రోడ్లపైనే ప్రవహిస్తున్న నీరు



పెదకాకానిలో దెబ్బతిన్న మిరప నారుమళ్లు

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్
- తక్షణమే నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామని భరోసా



పెదకాకాని: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ పి.నాగలక్ష్మి అన్నారు. పెదకాకానిలో తుఫాన్ ప్రభావంతో పల్లాలమ్మ చెరువు పక్కనే నివసిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్యకాలనీ, బాజీనగర్‌వాసులు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. తుఫాన్ ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించేందుకు కలెక్టర్ బుధవారం సాయంత్రం పెదకాకాని వచ్చారు. బాజీబాబానగర్, పుచ్చలపల్లి సుందరయ్యకాలనీని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా అందించే నష్టపరిహారం అందిస్తావన్నారు. తక్షణమే అందరికీ నిత్యావసర సరుకులు 25 కిలోలు బియ్యం, కిలో చొప్పున నూనె, కందిపప్పు, బంగాళదుంపలు, పంచదార పంపిణీ చేయాలని స్థానిక అధికారులకు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు సకాలంలో ఆహారం అందించాలని, ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంట్లో ఉన్న బీరువా ఎత్తులో వరద నీరు చేరిందని, దుస్తులు, వస్తువులు, పిల్లలు చదువుకునే పుస్తకాలు సైతం నీటిలో నానిపోయాయని స్థానికులు జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ నష్టపోయిన పేదలను ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం కలెక్టర్ పి.నాగలక్ష్మి మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల పరిధిలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, తహసీల్దార్ టి.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

దర్గాలో హుండీల కానుకలు లెక్కింపు

పెదకాకాని: బాజీబాబా దర్గాలోని హుండీల కానుకలను లెక్కించినట్లు దర్గా వక్ఫ్‌బోర్డు ఈఓ షేక్ ముక్తార్ బాషా తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు బుధవారం పెదకాకాని హజరత్ సయ్యద్ షహీద్ అవులియా దర్గాలో ఆరు హుండీల కానుకలు లెక్కించగా బాబా వారికి రూ.14,90,175 ఆదాయం లభించిందన్నారు. గతంలో కంటే హుండీల కానుకల ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. 5 నెలల హుండీలను రెవెన్యూ, పోలీసుశాఖల పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘాలో కానుకలు లెక్కించడం జరిగిందన్నారు. ఈ హుండీల కానుకలు లెక్కింపును రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డెప్యూటీ సెక్రటరీ ఎండీ అలీ, సూపరింటెండెంట్ సయ్యద్ రౌఫ్ పర్యవేక్షించారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేత



బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని నంబూరు యానాది కాలనీలో హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమ సుల్తానాల ఆధ్వర్యంలో 170 మంది బాధిత కుటుంబాలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ ఎమర్జెన్సీ మందులు కూడా త్వరలో అందజేస్తామన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు. పిల్లలు అనారోగ్యంతో ఉంటే వారికి వైద్య సేవలు అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఆరోగ్యానికి హోప్ విన్ హాస్పిటల్స్ భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ఏ అనారోగ్యం వచ్చిన అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడు ముందుటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోప్ విన్ హాస్పిటల్స్ డాక్టర్స్, మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు విజ్ఞాన్స్ వర్సిటీ చేయూత



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ విజయవాడలోని వరద బాధితులకు చేయూతగా ఆహారాన్ని అందించామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ నుంచి వరసగా రెండో రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన ఆరుబస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ తరఫున వరద బాధితుల కోసం 10 వేల కిచిడీ, పెరుగన్నం, వాటర్ ప్యాకెట్లను ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయించి బాధితులకు అందించామన్నారు.

వృత్తి నిబద్ధతకు పట్టం

అక్షర సేవలో.. 36 ఏళ్లు

- ఆంగ్ల భాషను అనర్గళంగా నేర్పించడంలో శైలి విలక్షణం
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన జోసఫ్ సుధీర్‌బాబు
- నేడు జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం



చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ పాఠ్యాంశాలను బోధిస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన జోసఫ్ సుధీర్‌బాబు

ప్రత్తిపాడు: ఆంగ్ల మాధ్యమంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు ఒడిసిపట్టడంలో ఆయనో నిత్య విద్యార్థి. సులభతర పద్ధతుల్లో విద్యార్థులకు ఆంగ్లభాషను అనర్గళంగా నేర్పించడం, ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందించడంలో ఆయన శైలి విలక్షణం. 36 ఏళ్లుగా వృత్తిలో అంకిత భావంతో అక్షరసేవలో అలుపెరగని పయనం సాగిస్తున్నారు ఆంగ్ల భాషా ఉపాధ్యాయుడు జొన్నలగడ్డ జోసఫ్ సుధీర్‌బాబు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ఈ మాస్టార్ని 'సాక్షి' పలకరించింది.

ప్రస్తుతం ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా సుధీర్‌బాబు పని చేస్తున్నారు. 1989లో ఉన్నవ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధుల్లో చేరారు. తరువాత బెల్లంకొండ, కారంపూడిపాడుల్లో, చినకోండ్రుపాడుల్లో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తించి ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్‌గా పొత్తూరు, వంగిపురం, చినకోండ్రుపాడు గ్రామల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ప్రతి చోట తనదైన శైలిలో విద్యార్థులకు మెరుగైన బోధనను అందిస్తూ వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి..

ఆయన పనిచేసిన పాఠశాలల్లో దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ఆయనకు అలవాటు. హ్యాండ్ వాష్ వంటి కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అక్షరదీప్తి వంటి వయోజన విద్యా కార్యక్రమాల్లో యాక్టివ్ రోల్ పోషించి గ్రామాల్లోని పెద్దలకు అక్షర జ్ఞానం కల్పించడంలో తన వంతుగా కృషి చేశారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



ఒక ఉపాధ్యాయునిగా విద్యార్థిని ఉన్నతంగా తీర్చి దిద్దగలిగినపుడే ఆనందాన్ని పొందగలం. తాను విద్యాబుద్ధులు నేర్పించిన విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ప్రతి ఉపాధ్యాయుడు ఆకాంక్షిస్తాడు. సమాజానికి అవసరమయ్యే బావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో తన వంతుగా కృషి చేస్తా. ఆంగ్లభాషపై విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందిస్తున్నా.

–జొన్నలగడ్డ జోసఫ్ సుధీర్‌బాబు

వరద బాధితుల కోసం.. చేయి చేయి కలిపి



వరద బాధితులకు ఆహారాన్ని స్వచ్ఛందంగా తయారు చేస్తున్న మహిళలు



ప్రత్తిపాడు: బెజవాడను ముంచేసిన వరద బీభత్సం అంతాఇంతా కాదు. ఆహారం కోసం అక్కడి ముందు బాధితులు పడుతున్న హృదయ విదారక ఘటనలు అన్నీ ఇన్నీ కావు. అలాంటి వారి కోసం తమ వంతుగా ఏమైనా సాయం చేయాలనుకున్నారు ప్రత్తిపాడుకు అంకమ్మ గుడి సెంటరుకు చెందిన కొందరు మహిళలు. అనుకున్నదే తడవుగా బుధవారం ఉదయం మహిళలంతా తలా కొంత చందాలు వేసుకోవడంతో పాటు కొందరు ఔత్సాహికుల ఆర్థిక సహకారంతో బగారా రైస్, కుర్మా, పెరుగన్నం, వాటర్‌బాటిల్స్, బిస్కట్ ప్యాకెట్లు సిద్ధం చేశారు. వాటిని ప్యాకింగ్ చేసి స్థానికుల సాయంతో విజయవాడకు తరలించారు. అక్కడ వరద బాధితులకు పంపిణీ చేయనున్నారు.

డీవీసీ కాలనీ సమస్యలకు పరిష్కారం



హెవీ మోటార్లతో నీటిని తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణంలోని ఏడో వార్డు డీవీసీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. వర్షాల ప్రభావంతో ఇళ్లలోకి చేరిన నీటి తొలగింపులో అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతూ నిండా నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం శీర్షికన బుధవారం సాక్షి కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన హెవీ మోటార్లను వినియోగించి సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలు ఎక్కువ వేసి తూముకు అడ్డుకట్ట వేసేలా పనులు నిర్వహించారు. అధికారుల చర్యలతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



తూముకు అడ్డుకట్ట వేస్తున్న కార్మికులు

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయ పని సర్దుబాటును నిలిపివేయాలని మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రవికుమార్ కోరారు. బుధవారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన సంఘ నాయకులు పని సర్దుబాటు ప్రక్రియలో జరిగిన అవకతవకలు సరిచేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లోని మిగులు ఉపాధ్యాయులను నగర పాలక సంస్థల పాఠశాలల్లో సర్దుబాటు చేయటం నిబంధనలకు వ్యతిరేకమని, తక్షణమే సంబంధిత ఉపాధ్యాయులను జెడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలలకు పంపాలన్నారు.